సాక్షి
విశాఖపట్నం
గురువారం । 1 । మే । 2025

శోక సంద్రంలో మృతుల కుటుంబ సభ్యులు





శిథిలాలు తొలగిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్

హా.. నరహరీ

ఆర్తనాదాలతో మార్మోగిన సింహగిరి

- పాలకుల నిర్లక్ష్యానికి ఏడు ప్రాణాలు బలి
- సింహాచలం చరిత్రలోనే తొలిసారి విషాదం
- మృత్యుఘోష వినకుండా.. దర్శనాలపైనే వీవీఐపీల దృష్టి
- వీఐపీ దర్శనాల కోసమే పనిచేసిన మంత్రుల కమిటీ

సాక్షి, విశాఖపట్నం : నిత్యం నృసింహుని నామస్మరణతో పులకించే పవిత్ర సింహగిరి.. భక్తుల ఆర్తనాదాలతో కన్నీటి సంద్రమైంది. గోవిందా.. గోవిందా.. సింహాద్రి అప్పన్నా.. కాపాడు అని ఆ దేవ దేవుడిని వేడుకునే భక్తకోటి గొంతులే.. ప్రాణభయంతో రక్షించండి.. చచ్చిపోతున్నాం అంటూ హాహాకారాలు పెట్టాయి. సింహాద్రినాథుని నిజరూప దర్శనం కోసం వచ్చిన భక్తుల ఆశలు అక్కడికక్కడే సమాధి అయ్యాయి. స్వామి దర్శనానికి అడుగుల దూరంలో ఉండగానే.. కొందరు అనంతలోకాలకు చేరుకున్నారు. సింహాచలం దేవస్థానం చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని ఈ మహా విషాదం.. పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. కనులపండువగా జరగాల్సిన చందనోత్సవం.. ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యం, మంత్రుల ప్రచార యావ, ప్రజాప్రతినిధుల సేవలో తరించిన అధికారుల చేతకానితనంతో తీరని దుఃఖాన్ని, అంతులేని వేదనను మిగిల్చింది. ఏడు నిండు ప్రాణాలను బలిగొన్న ఘోర వైఫల్యోత్సవంగా.. ఈ చందనోత్సవం చరిత్రలో నిలిచిపోతుంది.



సహాయక చర్యల్లో కలెక్టర్ హరేందిర ప్రసాద్

భక్తుల ప్రాణాలకు విలువేదీ?

రెండు వారాలుగా ఐదుగురు మంత్రుల కమిటీ పేరుతో జరిగిన హడావుడి అంతా ఇంతా కాదు. సమీక్షల మీద సమీక్షలు, పకడ్బందీ ఏర్పాట్లంటూ ప్రగల్భాలు పలికారు. కానీ.. క్షేత్ర స్థాయిలో జరిగింది శూన్యం. ఏటా చందనోత్సవం రోజు వర్షం కురవడం ఆనవాయితీ. ఈ చిన్నపాటి ముందుచూపు కూడా లేకుండా.. కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా అధికారులు, మంత్రులు ఏం చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. వారి దృష్టి అంతా వీఐపీ టికెట్ల పంపకాలు, ప్రచార ఆర్భాటంపైనే కేంద్రీకృతమైంది తప్ప.. సామాన్య భక్తుల సౌకర్యాలు, భద్రత పట్టలేదు. ఫలితం ఈ ఘోర విషాదం.

కటిక చీకటి.. అంతలోనే భారీ శబ్దం

'జోరువాన.. భయంకరమైన గాలి.. కటిక చీకటి.. అంతలోనే భారీ శబ్దం. ఏం జరిగిందో చూసేలోపే.. మా ముందున్న వాళ్లు గోడ శిథిలాల కింద నలిగిపోయారు. అప్పటి దాకా గోవింద నామస్మరణతో మాతో పాటే నడిచిన వారు.. కళ్ల ముందే విగతజీవులుగా మారిపోయారు.' ప్రమాదం నుంచి బయటపడిన ప్రత్యక్ష సాక్షులు ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకుంటూ వణికిపోయారు.



శిథిలాల కింద మృతదేహాన్ని, తాళ్లు, రాడ్లతో తీస్తున్న రెస్క్యూ టీమ్

చీకటిలో మృత్యు ఘోష

బుధవారం వేకువజామున 2.22 గంటలకు ఈదురుగాలులు మొదలయ్యాయి. 2.25 గంటలకు గాలుల తీవ్రత పెరిగింది.. అప్పటికే వేలాది మంది భక్తులు క్యూల్లో దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. 2.30 గంటలకు వర్షం ప్రారంభమైంది. 2.45 గంటలకు ఈదురుగాలులతో భారీ వర్షంగా మారింది. క్యూల్లో వేల మంది భక్తులు తలదాచుకునేందుకు సరైన వసతి లేదు. రూ.300 టికెట్ క్యూల్లోని భక్తులు వర్షపు నీరు రాని చోట ఆగారు. మరికొందరు తడిసి ముద్దవుతూనే స్వామి దర్శనం కోసం ముందుకు కదిలారు. సరిగ్గా కొత్త షాపింగ్ కాంప్లెక్స్ పైభాగం నుంచి ఇంకో 100 మీటర్లు ముందుకు వెళ్తే స్వామి దర్శనం కలుగుతుంది. ఇంతలో ఊహించని విపత్తు.. సరిగ్గా 3.05 గంటలకు కొత్తగా నిర్మించిన గోడపైకి వరదనీరు వచ్చింది. దీంతో గోడ బీటలు వారింది. టెంట్ గోడపైనే ఏర్పాటు చేయడంతో ఈదురుగాలులకు కూలిపోయింది. అదే సమయంలో గోడ ఒక్కసారిగా కుప్పకూలి భక్తులపై పడింది. గోడ శిథిలాల కింద ఏడుగురు భక్తులు చిక్కుకొని మృత్యు ఒడికి చేరారు.

శవాలపైనా నిలబడ్డారయ్యా!

ఓవైపు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించాలన్న ఆరాటం.. మరోవైపు కుండపోత వర్షం, చీకటి. 'కాపాడండి.. మా వాళ్లు కింద ఉన్నారు' అంటూ భక్తులు పెట్టిన రోదనలు మిన్నంటాయి. కొందరు భక్తులు, అన్నవరం నుంచి వచ్చిన ఓ ఉద్యోగి తమ ప్రాణాలను సైతం లెక్కచేయక శిథిలాలను తొలగించే ప్రయత్నం చేశారు. సహాయక సిబ్బంది వచ్చేలోపు ఒక్కరినైనా కాపాడలేమా అని విశ్వప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు హుటాహుటిన చేరుకున్నాయి. అయితే ఆ చీకటిలో ఎవరు ఎక్కడున్నారో తెలియక.. శిథిలాల తొలగింపులో భాగంగా సహాయక సిబ్బంది మృతదేహాలపైనే నిలబడటం చూసి.. 'అయ్యా.. మా వాళ్ల శవాలపై నిలబడ్డారు.. దయచేసి పక్కకు జరగండి' అని బంధువులు వేడుకోవడం అక్కడి దుస్థితికి అద్దం పట్టింది. సుమారు రెండున్నర గంటల శ్రమ అనంతరం మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

ఐదుగురు మంత్రుల కమిటీ ఏం చేసింది?

ఘటన జరిగిన సమయంలో అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, ప్రభుత్వ విప్ గణబాబు సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వీఐపీ దర్శనాల కోసం ఆలయంలోనే ఉన్నారు. పక్కనే ఇంత ఘోరం జరిగినా.. భక్తులు ఆర్తనాదాలు పెడుతున్నా.. వారు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఐదుగురు మంత్రుల కమిటీ సమీక్షలు, ఏర్పాట్లపై చేసిన ప్రగల్భాలు ఏమయ్యాయని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కేవలం వీఐపీ టికెట్లు ఎవరు ఎన్ని పంచుకోవాలన్న దానిపైనే మంత్రుల కమిటీ సమీక్షలు నిర్వహించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రుల సేవలో తరించిన అధికారులు.. భక్తుల ప్రాణాలను గాలిలో కలిపేశారని, ఈ పాపం ప్రభుత్వానిదేనని కన్నీటిపర్యంతమయ్యారు.

ఆ ఇద్దరూ ఎక్కడ?

- విషాదాన్ని పట్టించుకోకుండా విహారానికి..
- పల్లా, శ్రీభరత్ తీరుపై సర్వత్రా ఆగ్రహం

సాక్షి, విశాఖపట్నం : చందనోత్సవం వేళ సింహగిరిపై ఊహకందని పెను విషాదం జరిగినా.. ఇద్దరు టీడీపీ కీలక నేతలు మాత్రం ఏమి పట్టనట్లుగా వ్యవహరించారు. ఇందులో ఒకరు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్‌కాగా.. మరొకరు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు. వేకువ జామునే దర్శనానికి వచ్చిన వీరిద్దరికీ.. ప్రమాదం గురించి తెలిసినా కనీసం అటువైపుగా రాలేదు. నిజరూప దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత శ్రీభరత్ ఢిల్లీ వెళ్లిపోగా.. పల్లా శ్రీనివాసరావు విజయవాడలో పెళ్లికి పయనమయ్యారు. ప్రధాన దేవాలయంలో మహా విషాదం అలుముకున్నా పట్టించుకోకుండా.. తమ సొంత వ్యాపకాలకే ప్రాధాన్యమివ్వడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.



సొమ్మసిల్లిపోయిన మృతుల బంధువు



పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



బోరున విలపిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహేష్ తల్లి శాంతి, సోదరి, బంధువులు



పోస్టుమార్టం పత్రాలపై సంతకాలు పెట్టమని మహేష్ తండ్రిపై ఒత్తిడి చేస్తున్న ఎస్‌ఐ

బాధిత కుటుంబాలకు భరోసా



మహేష్, శైలజ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సాయంత్రం విశాఖకు వచ్చిన మాజీ సీఎం జగన్
- నేరుగా చంద్రంపాలెంలో బాధిత కుటుంబం ఇంటికి పయనం
- ఆయనను విశాఖకు రానీయకుండా చేసేందుకు కూటమి విశ్వప్రయత్నాలు
- హడావుడిగా పోస్టుమార్టం నిర్వహణ
- అయినప్పటికీ బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన జగన్

విశాఖ సిటీ: సింహాచలంలో గోడ కూలి మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్న వార్త కూటమి ప్రజా ప్రతినిధుల్లో వణుకు పుట్టించింది. జగన్ నేరుగా కేజీహెచ్‌కు వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడతారని ముందు షెడ్యూల్ రావడంతో వెంటనే మంత్రులు, ఎమ్మెల్యేలు అలెర్ట్ అయిపోయారు. కేజీహెచ్ మార్చురీ వద్ద హడావుడి చేశారు. మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించాలని వైద్యాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యుల సంతకాలు లేకుండానే పోస్టుమార్టం చేసి తరువాత ఆ తతంగాన్ని పూర్తి చేశారు. మృతదేహాలను కేజీహెచ్ నుంచి వారి ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సాయంత్రం 4.50 గంటలకు విశాఖకు వచ్చారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా చంద్రంపాలెంలో ఉన్న మృతులు పిల్లా ఉమామహేశ్వరరావు, పిల్లా శైలజ కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లారు. అక్కడ వారికి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ తరఫున మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అక్కడి నుంచి విమానాశ్రయానికి చేరుకొని 7.15 గంటలకు విజయవాడకు తిరుగుపయనమయ్యారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు.

సింహాచలం ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యమే..

- కుటుంబాలకు రూ.కోటి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- మాజీ మంత్రి అమర్‌నాథ్ డిమాండ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

దాబాగార్డెన్స్/ఆరిలోవ: సింహగిరిపై గోడ కూలిన ఘటనలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.కోటి నష్ట పరిహారంతో పాటు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. కేజీహెచ్ వద్ద మృతుల కుటుంబ సభ్యులను విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ నాయకులు కొండా రాజీవ్‌గాంధీ, పేడాడ రమణికుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ్, రవిరెడ్డి, జియ్యాని శ్రీధర్, పలువురు నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానానికి వైకుంఠ ఏకాదశి ఎంత పవిత్రమో.. సింహాచలానికి చందనోత్సవం అంత పవిత్రమని చెప్పారు. సుమారుగా 2 నుంచి 3 లక్షల వరకు భక్తులు వస్తారని తెలిసీ కూడా అవసరమైన ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. కొండవాలులో ఎంతో పటిష్టంగా నిర్మించాల్సిన రక్షణ గోడను ఫ్లైయాష్ ఇటుకలతో నిర్మించడమే గాక పెండాల్స్‌ను గోడకు కట్టడం.. ఫలితంగా ఏడుగురు భక్తుల ప్రాణాలు తీశారన్నారు. ఈ ఘటనతో ప్రభుత్వ నిర్లక్ష్యం.. చేతగానితనం తేటతెల్లమైందన్నారు. భక్తులకు చేసిన ఏర్పాట్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. మృతుల కుటుంబాల రోదన అంతా ఇంతా కాదన్నారు. ప్రభుత్వం ఈ ఘటనను కూడా రాజకీయం చేయడం దారుణమన్నారు. చనిపోయిన వారి కుటుంబానికి రూ.కోటి పరిహారం, శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇది 'కూటమి' వైఫల్యమే..

చందనోత్సవంలో ఇంతటి ఘోరం జరగడం దిగ్భ్రాంతి కలిగించిందని మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుత ఘటన నిస్సందేహంగా కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు.

భక్తులకు అష్టకష్టాలు



ఘాట్‌రోడ్డు వరకు బారులు తీరిన భక్తులు

- కొండ పైకి వెళ్లే బస్సు ఎక్కేందుకే గంటల తరబడి పడిగాపులు
- దర్శనానికి 5 నుంచి 8 గంటల పాటు క్యూల్లో నరకయాతన
- కొండపైకి విచ్చలవిడిగా కారు పాసులు

సింహాచలం/పెందుర్తి: సింహాచలేశుడి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనపడింది. సామాన్య భక్తులకు సరిపడా బస్సుల్ని నడపంలో నిర్లక్ష్యం చూపిన అధికార యంత్రాంగం, తమ వారికి మాత్రం విచ్చలవిడిగా కారు పాసులు మంజూరు చేసింది. పోలీసులు కూడా తమ బంధువుల్ని ఇష్టారీతిన నేరుగా దర్శనానికి తీసుకెళ్లి సామాన్య భక్తులకు నరకం చూపడంలో తమను మించిన వారు లేరని నిరూపించుకున్నారు.

అడుగు అడుగునా నరకం

శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. కొండ దిగువ నుంచి సింహగిరికి చేరుకునే క్రమంలో వేలాది మంది భక్తులు నరకాన్ని చవిచూశారు. భక్తులకు సరిపడా బస్సులు నడపడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. సాధారణ సమయంలో కొండ దిగువ నుంచి 15–20 నిమిషాల్లో చేరుకోవచ్చు. కానీ చందనోత్సవాన భక్తులు కింద నుంచి సింహగిరికి చేరుకోవడానికి సగటున నాలుగైదు గంటల సుదీర్ఘ సమయం పట్టింది. కొండ దిగువన ఇటు గోశాల వద్ద, అటు అడవివరం కూడలి వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి. బస్ ఎక్కేందుకు దాదాపు 2 గంటలు, సింహగిరి పైకి చేరుకునేందుకు మరో రెండు మూడు గంటల సమయం పట్టిందని వేలాది భక్తులు వాపోయారు. కిక్కిరిసిన బస్సుల వెంట జనం పరుగులు పెట్టారు. కింద నుంచి కొండ మీద వరకు మహిళలు సైతం వేలాడుతూ ప్రయాణించారు. దర్శనం తర్వాత ఇంటి ముఖం పట్టేందుకూ ఇదే నరకాన్ని ప్రభుత్వం చూపింది.



అరకొర బస్సులతో భక్తుల అవస్థలు



బస్సు ఎక్కేందుకు మహిళల పాట్లు

ఘాట్ రోడ్‌లో కిలోమీటర్ పైగా క్యూ

ఉదయం 11 తరువాత భక్తుల తాకిడి అమాంతం పెరిగిపోయింది. అప్పటివరకు లోవతోట వైపు ఉన్న ఉచిత క్యూలో మాత్రమే భక్తులు ఉండగా.. ఒక్కసారిగా భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో పోలీసులు క్యూను ఘాట్ రోడ్‌కు మళ్లించారు. దీంతో ఘాట్ రోడ్‌లో నిమిషాల్లో క్యూ కిలోమీటరు దాటిపోయింది. ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన చాలామంది భక్తులు సింహగిరి బస్టాండ్ వద్ద దిగి, తిరిగి ఘాట్ రోడ్డు క్యూకి చేరుకోవడానికి కిలో మీటర్‌పైగా వెనక్కి నడవాల్సి వచ్చింది. క్యూ లైన్‌లో చేరిన నుంచి స్వామి దర్శనం చేసుకుని తిరుగుముఖం పట్టేందుకు 5 నుంచి 8 గంటల సమయం పట్టింది. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుపతి వెంకన్న దర్శనానికి కూడా ఇంత సమయం పట్టింది లేదని కొందరు భక్తులు ఆవేదన వెళ్లగక్కారు. కూటమి నేతలు, అధికారులు, పోలీసుల కుటుంబాలు మాత్రం నిమిషాల వ్యవధిలోనే తమ కళ్లముందే దర్జాగా దర్శనం చేసుకుని వెళ్లిపోయారని ఆక్షేపించారు.

తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం



కొండపైకి ప్రైవేటు వాహనాలు అనుమతించలేదు. దీంతో దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సును ఆశ్రయించాం. గంటన్నర పాటు బస్సు కోసం ఉన్న తరువాత.. కొండపైకి చేరడానికి మరో మూడు గంటలు పట్టింది.

– నారాయణరావు, నర్సారావుపేట

భక్తులను గాలికి వదిలేశారు



బస్ ఎక్కడానికి క్యూ పద్ధతి పాటించాలన్నారు. దర్శనం అయ్యాక ఎవరూ పట్టించుకోలేదు. దీంతో తిరుగు ప్రయాణంలో బస్ ఎక్కడానికి దాదాపు 2 గంటలకు పైగా వేచి వుండాల్సి వచ్చింది. అధికారుల నిర్లక్ష్యం దారుణం.

– కల్యాణి, సోంపేట, శ్రీకాకుళం

నిజరూపం.. అపురూపం



క్యూలైన్లలో కిక్కిరిసిపోయిన భక్తులు

- అప్పన్న నిజరూప దర్శనం చేసుకుని పరవశించిన భక్తులు
- తెల్లవారుజామున 2.45 గంటల నుంచి సర్వదర్శనాలు

సింహాచలం: వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై జరిగిన చందనోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఏడాదిలో ఒక్కరోజు మాత్రమే లభించే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని తరించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం మేరకు బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, కలశారాధన చేశారు. అనంతరం వెండి బొరుగులతో స్వామిపై ఉన్న పన్నెండు మణుగుల చందనాన్ని ఒలిచి నిజరూపభరితుడిని చేశారు. తదుపరి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 2.20 గంటల సమయంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు స్వామి తొలిదర్శనాన్ని చేసుకున్నారు. అనంతరం సుమారు 2.45 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ తరఫున టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు.

నిజరూపాన్ని దర్శించుకున్న ప్రముఖులు

అప్పన్న నిజరూపాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఎంపీలు శ్రీభరత్, కె.అప్పలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ వీవీఎన్ మాధవ్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్‌చంద్, కమిషనర్ కె.రామచంద్రమోహన్, కలెక్టర్ హరేందిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. లక్షా 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు అధికారుల అంచనా.



స్వామికి చందనం తీసుకొస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు

పలుమార్లు వర్షంతో భక్తుల ఇక్కట్లు

తెల్లవారు జామున 2 గంటలు, సాయంత్రం 4 గంటల సమయంలో భారీ గాలులతో కురిసిన వర్షానికి భక్తులు ఇక్కట్లు పడ్డారు. వర్షంలో తడుస్తూనే స్వామి దర్శనానికి క్యూల్లో వేచి ఉన్నారు. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఒకపక్క సహస్ర ఘటాభిషేకం జరుగుతున్నా భక్తుల దర్శనాలు కొనసాగించారు. కొండ దిగువ పాత గోశాల జంక్షన్, అడవివరం జంక్షన్‌లో బస్సుల కోసం వేచి ఉన్న భక్తులు తడిసి ముద్దయ్యారు. ఉదయం కురిసిన భారీ వర్షాలకు పాత గోశాల జంక్షన్, అడవివరం జంక్షన్‌లో ఉన్న టెంట్‌లు నేలకొరిగాయి. ఘాట్ రోడ్డులో స్తంభం పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం

రాత్రి సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సింహగిరిపై ఉన్న గంగధార నుంచి వెయ్యి కలశాలతో శ్రీవైష్ణవ స్వాములు జలాలను తీసుకువచ్చారు. ఆ జలాలతో స్వామి నిజరూపాన్ని అర్చకులు అభిషేకించారు. 108 వెండి కలశాలతో ఔషధ ద్రవ్యాలను స్వామికి అభిషేకించారు.



ఘటాభిషేకంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి

అనంతరం స్వామికి విశేష పూజలు జరిపి, తొలివిడతగా సుమారు 125 కిలోల చందనాన్ని సమర్పించి, మళ్లీ నిత్యరూపభరితుడిని చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అరకు కాఫీ ఫ్రాంచైజీలు

నిబంధనలు ఖరారు చేసిన జీసీసీ

ఏయూక్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా జీసీసీ అరకు వ్యాలీ కాఫీ ఫ్రాంచైజీ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయడానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ఖరారు చేసినట్లు సంస్థ వైస్ చైర్మన్ కల్పనా కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలో సంస్థ సామర్థ్యం, ఉద్యోగుల అభివృద్ధికి ఉపయుక్తంగా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. సంస్థలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు చెప్పారు. సీనియర్ మేనేజర్ ఖాళీలను సైతం నెల రోజుల్లో భర్తీ చేయాలని నిర్ణయించామన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యనిర్వహణ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేస్తామన్నారు. శాఖల పనితీరును మెరుగుపరిచే విధంగా కేస్ వర్కర్ల నియామక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గిరిజన ఉత్పత్తుల మార్కెట్ పరిధిని విస్తరించి.. ఉపాధి అవకాశాలను పెంచాలనే ఉద్దేశంతో ఫ్రాంచైజీల సంఖ్యను పెంచుతున్నట్లు చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉందన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక పద్మ అవార్డులకు జిల్లా అధికార యంత్రాంగం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజ అభివృద్ధికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆసక్తి, అర్హులైన పౌరులు కేంద్ర ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ https://awards.gov.in ద్వారా జూన్ 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు పత్రాల ప్రింట్ కాపీలను జిల్లా యువజన సర్వీసుల శాఖ, మహారాణిపేటలోని కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

సాగర గర్భంలో భయో వ్యర్థాలు!



సముద్రంలో స్కూబా డైవర్లు వెలికితీసిన బయో వ్యర్థాలు


- ప్లాస్టిక్ వేస్ట్‌తో సమానంగా మెడికల్ వ్యర్థాలు లభ్యం
- బయో వేస్ట్ వెలికితీస్తున్న స్కూబా డైవర్లు
- జాలరిపేట, రుషికొండ తీరాల్లో ఎక్కువగా లభ్యం
- జలచరాలకు హానికరమంటున్న పర్యావరణవేత్తలు

సాక్షి, విశాఖపట్నం: సాగర తీరాన్ని బయో వ్యర్థాలు భయపెడుతున్నాయి. ప్రాణాంతకమైన మెడికల్ వేస్ట్‌ను అత్యంత భద్రంగా నిర్వహించాల్సి ఉండగా.. కొన్ని ఆస్పత్రులు సముద్రాన్నే డస్ట్‌బిన్‌గా మార్చేసుకున్నాయి. దీంతో ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలు సముద్రాన్ని ముంచెత్తుతున్నాయి. పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం ఏటా విశాఖ సాగర తీరంలో 350 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు, సుమారు 10 టన్నుల వరకు మెడికల్ వ్యర్థాలు సముద్రగర్భంలో కలుస్తున్నాయి. సాగర గర్భంలోకి చొచ్చుకుపోతున్న ఈ వ్యర్థాలు.. జీవ వైవిధ్యానికి చేటు తెస్తున్నాయి.. ఫలితంగా జలచరాలు నిర్జీవంగా మారిపోతున్నాయి. ఇటీవల ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించేందుకు స్వచ్ఛందంగా నడుంబిగించిన కొంతమంది స్కూబా డైవర్లు.. సముద్రం నుంచి బయో వ్యర్థాలు బయటపడుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెడీవేస్ట్ 'సీ'గా మార్చేస్తున్నారు

అందాల సముద్ర తీరాన్ని ఆస్వాదించేందుకు వస్తున్న పర్యాటకులకు మెడీ వేస్ట్ దర్శనమిస్తోంది. ఈ వ్యర్థాలను నిర్వహణ సంస్థలకు ఇవ్వాలంటే కొంత డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే బీచ్‌కు సమీపంలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఇంజిక్షన్లు, సిరంజీలు, కాలం చెల్లిన మందులు, ఇంజక్షన్ సీసాలు, సెలైన్ బాటిల్స్ సాగరంలో కలిపేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇలా బయో వ్యర్థాలను సముద్రంలో పారబోస్తున్నారు. కేవలం రూ.1000 నుంచి రూ.2 వేలకు కక్కుర్తి పడుతున్న చిన్న చిన్న ఆస్పత్రుల నిర్వాహకులు.. సముద్రాన్ని మెడీవేస్ట్ సీగా మార్చేస్తూ పర్యావరణానికి హానితలపెడుతున్నారు.

మూడు రోజుల వ్యవధిలో టన్ను వరకు..



ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్రం కలుషితమవుతున్న నేపథ్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా స్కూబా డైవర్లు.. సముద్ర పరిరక్షణకు పాటుపడుతున్నారు. వీరికి బయో వ్యర్థాలు కనిపిస్తుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర లోతుల్లో పోగుపడ్డ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే బాధ్యతను ఇటీవల కాలంలో ప్లాటిపస్ వంటి స్కూబా డైవింగ్ సంస్థలు స్వచ్ఛందంగా చేపడుతున్నాయి. సముద్ర గర్భంలో వ్యర్థాల ఏరివేత కోసం ఈ బృందాలు 3 కిలో మీటర్ల దూరం వరకూ వెళ్తున్నాయి. ఒడ్డు నుంచి ప్రారంభించి.. మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యర్థాల్ని తొలగిస్తున్నారు. ప్రతి రోజూ కనీసం 100 నుంచి 200 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రం నుంచి వెలికితీస్తున్నారు. ఇందులో కనీసం 10 నుంచి 20 కిలోల వరకూ బయో వ్యర్థాలు ఉంటున్నాయని వారు చెబుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో టన్ను వరకూ స్కూబా డైవర్లు మెడీవేస్ట్ ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యర్థాలు సముద్ర జీవరాశులతో పాటు.. పర్యాటకులకు ప్రాణహానిని కలిగిస్తుందని, అధికారులు తక్షణమే బయో వ్యర్థాలు సముద్రంలో కలవకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపైనే కాలం చెల్లిన మందులు

నగరంలో పలు చోట్ల రోడ్ల పక్కన చెత్తకుప్పల్లో కాలం చెల్లిన మందులు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్నాయి. వాస్తవంగా వీటిని ఇన్సినరేటర్‌లో వేసి బూడిద చేయాల్సి ఉంది. కానీ సుమారు టన్నుల కొద్ది వచ్చే ఈ వ్యర్థాలను సకాలంలో కాల్చకుండా .. ఇలా ఖాళీ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రైవేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ తరహా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. నిబంధనలను ఏమాత్రం లెక్కచేయక ఈ ఆస్పత్రులు, మెడికల్ షాపులు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయి. బయో వ్యర్థాలను తరలించేందుకు సంబంధిత యాజమాన్యాలు కొంత మొత్తం ఏపీపీసీబీ సూచించే వ్యర్థాల నియంత్రణ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఆస్పత్రి స్థాయికి తగ్గట్టు డబ్బులు చెల్లించాలి. పలుచోట్ల ఆయా సంస్థలు సక్రమంగా వచ్చి వ్యర్థాలను తీసుకెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క నగరంలోనే దాదాపు 600కు పైగా ఆస్పత్రులు ఉన్నాయి. పూర్తిస్థాయిలో ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వెలువడే వ్యర్థాలు దాదాపు బయట ప్రాంతాల్లో పోస్తున్నారు. నగరంలోని ఆస్పత్రుల్లో పది శాతానికి మించి నిబంధనలు పాటించడంలేదు. కాలం చెల్లిన మందులు, ఇతర వ్యర్థాల్ని ఇవ్వకుండా ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. నెలకు రూ.1,100 చెల్లిస్తే చాలు ప్రతీ ఆస్పత్రి వద్దకు వచ్చి నిర్వహణ సంస్థలు స్వయంగా తీసుకువెళ్తాయి. కానీ ఎవరూ దీనిని పట్టించుకోవడం లేదు. కాల పరిమితి ముగియడానికి 90 రోజులే గడువున్న మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్పత్రుల్లో పంపిణీ చేయకూడదని నిబంధనలున్నాయి.

అలాంటి మందులను సరఫరా చేసిన కంపెనీలకే తిప్పి పంపాల్సిందే. ఎందుకంటే ఒక ఔషధం దాని కాలపరిమితి తేదీకి 3 నెలల ముందు నుంచి అందులోని మందు శక్తిని కోల్పోతూ ఉంటుందని, అలాంటి మందులు వాడినా ప్రభావశీలంగా పనిచేసే అవకాశాలు తక్కువని వైద్యులు చెబుతున్నారు. ఇన్ని నిబంధనలున్నా వాటిని పక్కనపెట్టేసి ఆస్పత్రులు ఇలా పడేస్తుండటంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవకపోతే.. నగరం బయోవ్యర్థాలమయంగా మారిపోయే ప్రమాదముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.



నగరంలోని చెత్త కుప్పల్లో కాలం చెల్లిన మందులు



విమ్స్‌లో క్షతగాత్రుడికి పరామర్శ



విమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గుడివాడ అమర్‌నాథ్, మజ్జి శ్రీనివాస్ తదితరులు

ఆరిలోవ: సింహాచలం అప్పన్న చందనోత్సవంలో గోడ కూలిన ఘటనలో గాయపడిన ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన పి.ప్రవీణ్‌కుమార్‌కు విమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, పలువురు నాయకులతో కలసి బుధవారం పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రవీణ్‌కు మెరుగైన వైద్యం అందించాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును కోరారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవిరెడ్డి, శ్రీవాత్సవ్, కొండా రాజీవ్ తదితరులున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

94 శాతం మంది హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు విజయభాస్కర్



కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో పాలిసెట్ కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు



రూము నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు

మురళీనగర్: జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, పెందుర్తి పాలిటెక్నిక్, భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కో ఆర్డినేటింగ్ కేంద్రాల పరిధిలో ఏర్పాటుచేసిన 33 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 13,188 మంది విద్యార్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేయగా.. 12,363 మంది పరీక్షకు హాజరైనట్లు విశాఖ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. 94 శాతం మంది పరీక్ష రాయగా.. వీరిలో 7,422 మంది బాలురు, 4,941 మంది బాలికలు ఉన్నారు. విశాఖపట్నం కో–ఆర్డినేటింగ్ కేంద్రం పరిధిలో 9,405 మందికి 8,746 మంది, పెందుర్తి కేంద్రం పరిధిలో 2,635 మందికి 2,531 మంది, భీమిలి కేంద్రం పరిధిలో 1,148 మందికి 1,086 మంది పరీక్ష రాసినట్లు వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా పరిశీలకుడు విజయభాస్కర్, నగర పరిశీలకుడు జి.దామోదరరావు, సహాయ కో–ఆర్డినేటింగ్ అధికారి కేడీవీ నరసింహారావు తదితరులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, **KANUMILLI RAVI KANTH** S/o K.Surya Chandra Rao, Residing at D.No. 8-93, Sri Sai Saudha Nagar -2, Near Sampath Residency, Papayyarajupalem, Pendurthi, Visakhapatnam, (A.P). Changing my name from **KANAMILLI RAVI KANTH** (Old Name) To **KANUMILLI RAVI KANTH** (New Name) Shall Henceforth I am beaing called as **KANUMILLI RAVI KANTH** (New Name) for all further purpose.

Education

■ **Contact for Admissions in best** colleges of B.Tech, MBBS, BDS, BAMS, BHMS, Ag. B.Sc, MBA, Paramedical courses in India and Abroad. Ph : 79972 96796 [V- 12453]

SPOKEN ENGLISH

■ **Spoken English Batches Commence** for Children / Adults on 1st May 2025 Morning Batch. Contact : Sheila Jackson - 98484 98510. Olivet English Institute, Vizag. [V- SCA25003075]

Wanted

■ మీ ఇంటివద్దనే వుంటూ **Universal** కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA25003056]

■ **SBI LIFE INSURANCE Sales Manager** / Dev. Officer onrole Job Recruitment. S.KOTA, VZM, NAD, VIZAG. Min.1Yr. Sales Exp. Cont. BM. : 90522 16662. Agents, Team Leader Commission, Foreign Trips, Pension, Free Health Card. [V- 2792]

Real Estate

PLOT FOR SALE

■ అతి తక్కువ ధరకే ఇంటి స్థలం. గాజువాక దగ్గరలో, GVMC పరిధిలో 90, 100, 150 గజాలు ప్లాట్లు కలవు గజం ధర : 5,999/–, రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్ : 91601 91101 [SCA25003051]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కాలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

మంత్రులు రాజీనామా చేయాలి

జన జాగరణ సమితి డిమాండ్

సీతమ్మధార: సింహాచలం చందనోత్సవ నిర్వహణ కమిటీలో ఉన్న మంత్రులందరూ రాజీనామా చేయాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్ వాసు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చందనోత్సవ నిర్వహణ మంత్రుల కమిటీ కేవలం వీఐపీ పాసుల పంపకాల కోసం సమావేశంలో చర్చించుకుని.. జీడిపప్పు, బాదంపాలు ఆరగించి ముగించారని మండిపడ్డారు. కమిటీలో భక్తుల సౌకర్యాలు, భద్రతపై దృష్టి సారించలేదన్నారు. నాసిరకం గోడ కూలి భక్తులు అకారణంగా మృతి చెందారన్నారు. కూటమి ప్రభుత్వంలో హిందూ భక్తుల ప్రాణాలకే విలువ లేకుండా పోయిందన్నారు. హిందూ దేవాలయాల ఉత్సవాల్లో పాల్గొంటే తిరిగి ఇంటికి వస్తామో లేదో అనే ప్రాణ భయంతో భక్తులు వణికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన ఒక్కో భక్తుడి కుటుంబానికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం దేవదాయ శాఖను నిర్వహించే అర్హతను పూర్తిగా కోల్పోయిందని యావత్ హిందూ సమాజం భావిస్తోందన్నారు.

అడవివరంలో విషాదఛాయలు



ఎడ్ల వెంకటరావు

సింహాచలం: సింహగిరిపై రిటైనింగ్ వాల్ కూలిన ఘటనలో స్టీల్‌ప్లాంట్ జనరల్ ఫోర్‌మెన్ ఎడ్ల వెంకటరావు(56) మృతితో అడవివరంలో విషాదం నెలకొంది. పాతికేళ్లుగా ఈయన ఇక్కడి బీసీ గురుకుల పాఠశాల సమీపంలో నివసిస్తున్నారు. ఆయన భార్య రామలక్ష్మి గురుకుల పాఠశాలలోనే స్టాఫ్ నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నారు. పెద్ద కుమారుడు ప్రవీణ్‌కు నెల రోజుల క్రితం వివాహం కావడంతో భార్యతో కలిసి బెంగళూరులో, చిన్నకుమారుడు పృథ్వీ చెన్నైలో ఉంటున్నారు. చందనోత్సవం సందర్భంగా తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఇంటి నుంచి కొండపైకి వెళ్లారు. వెళ్లిన గంటలోగానే మరణించారు. కేజీహెచ్‌లో పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగృహానికి తీసుకొచ్చి, పాత అడవివరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ గుర్తింపు యూనియన్ నాయకుడు పాశర్ల పైడిరాజు, స్టీల్‌ప్లాంట్ సిటు నాయకుడు అప్పారావు, ట్రేడ్ యూనియన్ నాయకులు తరలివచ్చి వెంకటరావు మృతదేహానికి నివాళులు అర్పించారు. ఎప్పుడూ సరదాగా ఉండే వెంకటరావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది



పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో అదనపు కమిషనర్ రమణమూర్తి, ఇతర అధికారులు

అల్లిపురం: జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పనిసరని, ఇది శేష జీవితానికి పునాది లాంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ బి.వి.రమణమూర్తి అన్నారు. జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఏడుగురు ఉద్యోగులను అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, డీపీవో ఫణిరామ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పద్మజతో కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలన్నారు. ఆరోగ్యం కోసం ఏదో పని కల్పించుకోవాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రూ.65,47,310 ప్రావిడెంట్ ఫండ్‌ను అందజేశారు. ఏపీడబ్ల్యూఈఎంఎస్, జీమ్స్ జనరల్ సెక్రటరీ ఎ.అప్పలరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జంట హత్యల కేసు కొలిక్కి?

కూర్మన్నపాలెం: రాజీవ్‌నగర్‌లో జరిగిన జంట హత్యల కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు.. ముమ్మరంగా గాలింపు చేపట్టి హంతకుడి ఆచూకీ కనుగొన్నట్లు అధికార వర్గాల సమాచారం. ఈ కేసు దర్యాప్తులో భాగంగా దంపతులకు చెందిన స్కూటీ విశాఖ రైల్వేస్టేషన్‌లో గుర్తించడం కీలక పరిణామంగా భావిస్తున్నారు. హంతకుడు హత్యలు చేసిన వెంటనే నేరుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లి.. అక్కడి నుంచి రైలులో పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. హంతకుడు ఆ కుటుంబానికి బాగా తెలిసిన వ్యక్తే అయి ఉంటాడని ఒక అంచనాకు వచ్చారు. హైదరాబాద్ నుంచి భార్యాభర్తలు వచ్చిన రోజే ఈ ఘాతుకం జరగడంతో.. ఆ కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం హంతకుడు మొదట లక్ష్మిపై దాడి చేశాడు. ఈ ఘాతుకాన్ని యోగేంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పాటు కేకలు వేసుకుంటూ బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా అతన్ని గుమ్మం వద్దే హత మార్చి, నిందితుడు తలుపులు వేసి పారిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. హంతకుడు స్కూటీని రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి, అక్కడి నుంచి ఒడిశాకు వెళ్లి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. నిందితుడిని త్వరలోనే మీడియా ముందు ప్రవేశపెడతామని పోలీసులు తెలపడంతో.. హంతకుడు దాదాపు నిర్ధారణ అయినట్లే!

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్‌లో గ్యాస్ లీకేజీ

నలుగురు ఉద్యోగుల అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో బుధవారం గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకుంది. నలుగురు ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. ఒకటో బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగంలో ఉద్యోగులు విధి నిర్వహణలో ట్యూయర్ ప్లాట్‌ఫారంపై హోస్‌పైపు మార్చే క్రమంలో పైపు నుంచి గ్యాస్ లీకయింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న యాదవ్ (సీనియర్ మేనేజర్), ఎ.వెంకటేశ్వరరావు(ఫోర్‌మెన్), రామరాజు (ఫోర్‌మెన్), అప్పలరాజు (కాంట్రాక్ట్ కార్మికుడు) గ్యాస్ ఉధృతికి అస్వస్థతకు లోనయ్యారు. గమనించిన తోటి ఉద్యోగులు హుటాహుటిన ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఎ.వెంకటేశ్వరరావును మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురూ ఉక్కు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

ప్లాంట్ ఉత్పత్తి పెంచే క్రమంలో యాజమాన్యం భద్రతను నిర్లక్ష్యం చేస్తోందని, దీని వల్లే ప్రమాదం జరిగిందని స్టీల్ సీఐటీయూ నాయకులు ఆరోపించారు. అస్వస్థతకు గురైన ఉద్యోగులను తరలించిన అంబులెన్స్‌లో ఆక్సిజన్ సదుపాయం కూడా లేదని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు మేయర్ పరామర్శ



మార్చురీ వద్ద పోలీసులతో మాట్లాడుతున్న మేయర్ శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంగారావు

అల్లిపురం: సింహగిరిపై గోడ కూలిన ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ గంగారావు బుధవారం పరామర్శించారు. కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెంటనే స్పందించి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను అప్రమత్తం చేశారని మేయర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ఉద్యోగం ప్రకటించారని పేర్కొన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తునకు కమిటీని ఏర్పాటు చేశారని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు.

ఓవరాల్ చాంప్ ఎలక్ట్రికల్ ఆపరేషన్స్ జట్టు



ఓవరాల్ చాంప్ సాధించిన ఎలక్ట్రికల్ ఆపరేషన్స్ జట్టు



రన్నరప్‌గా నిలిచిన ఆర్పీఎఫ్ జట్టు

ముగిసిన రైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మీట్

విశాఖ స్పోర్ట్స్: తూర్పు కోస్తా రైల్వే క్రీడా సంఘం(ఈకోర్సా) ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగిన వాల్తేర్ డివిజన్ అంతర విభాగాల క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. కార్మిక శక్తిలో క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించే నినాదంతో నిర్వహించిన ఈ పోటీల్లో 14 విభాగాల నుంచి పురుషులు, మహిళలు 12 క్రీడాంశాల్లో వేర్వేరుగా తలపడ్డారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ (ఆపరేషన్స్) జట్టు ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోగా, ఆర్పీఎఫ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్‌లో ఈఎల్ఈసీ జట్టు, క్యారమ్స్‌లో ఈఎల్ఎస్, చెస్‌లో ఎలక్ట్రికల్(ఓ), టీటీలో కమర్షియల్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో ఈఎల్ఈసీ, అథ్లెటిక్స్‌లో ఆర్పీఎఫ్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లలో సీడబ్ల్యూ, ఫుట్‌బాల్‌లో ఆపరేటింగ్, క్రికెట్‌లో సంయుక్తంగా ఈఎల్ఈసీ–ఆర్పీఎఫ్ జట్లు, టెన్నిస్‌లో ఎస్అండ్‌టీ జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ సందర్భంగా శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బోహ్రా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల్లో స్నేహం, పరస్పర సహకారం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. అకౌంట్స్, మెడికల్, ఇంజినీరింగ్, కమర్షియల్, ఎలక్ట్రికల్(జనరల్), మెకానికల్, పర్సనల్, కన్‌స్ట్రక్షన్, సిగ్నల్ టెలికాం, మెకానికల్ (డీఎల్ఎస్), ఎలక్ట్రికల్(ఆపరేషన్స్), ఎలక్ట్రికల్(టీఆర్ఎస్), ఎలక్ట్రికల్(టీఆర్‌డి), ఆర్పీఎఫ్, సేఫ్టీ, స్పోర్ట్స్ విభాగాల జట్లు పోటీపడినట్లు తెలిపారు. అనంతరం డీఆర్ఎం విజేతలకు ట్రోఫీలు అందించగా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతారామ్, క్రీడాధికారి ఎం.హరనాథ్, సంయుక్త క్రీడాధికారి ఎ.అవినాష్, కోశాధికారి కబీర్ అన్సారి, సహాయ క్రీడాధికారి పాటిల్, కార్యదర్శి ఉష తదితర అధికారులు పాల్గొన్నారు.